క్లుప్తంగా

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఏపీఓ సంజీవరెడ్డి

తాడిమర్రి: ఉపాధిహామీ పథకం ద్వారా సాగు చేసిన పండ్ల తోటలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఓ సంజీవరెడ్డి క్షేత్ర సహాయకులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చీనీ, మామిడి, సపోటా తదితర పండ్ల తోటలను సాగు చేసిన రైతులకు బిల్లులు అందించేలా చర్యలు చేట్టాలన్నారు. బిల్లులు సక్రమంగా అందలేదంటూ ఒక్క రైతు కూడా బాధపడకూడదన్నారు. అలాగే మరో రెండు నెలల్లో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పనులకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈసీ అశోక్ కుమార్‌రెడ్డి, ఏటీలు, ఎస్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి హారతి ఇస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

ప్రశాంతి నిలయం: పట్టణంలో బుధవారం రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్ సాయిగీత, లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కవిత తదితరులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

రూ.8 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం

పుట్టపర్తి అర్బన్: మండలంలో జగరాజుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.8 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నారు. సిమెంటు రోడ్డు నిర్మాణంలో ఉండటంతో ఆ మార్గంలో వాహనాలకు అనుమతి లేదని పంచాయతీ రాజ్ అధికారి శశికుమార్, ఎంపీడీఓ అశోక్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధాన రోడ్డు కావడంతో వాహనాలు ఎటువైపుకు వెళ్లడానికి ఆస్కారం లేదన్నారు. కనీసం 15 రోజుల పాటు వాహనాలు నడపకుండా సహకరించాలన్నారు. కియా బస్సులు, ఆర్టీసీ బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడపాలని సూచించారు. గ్రామంలోకి బస్సులు, కార్లు, జీపులు వెళ్లే ఇబ్బంది పడతారన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఓడీచెరువు గ్రామ సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. కుటుంబ సభ్యులకు పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వ్యవసాయ గోదాములు ఏర్పాటు చేసి రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. గతంలో ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి పలుమార్లు తిరిగితే కానీ పనులు జరిగేవి కాదన్నారు. ప్రస్తుతం సొంత గ్రామంలోనే అన్ని రకాల సమస్యలు తీరడమే కాకుండా గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా లంచాలకు తావు లేకుండా ప్రభుత్వం పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందిస్తోందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరొకమారు ఆశీర్వదించి రాష్ట్రాభివృద్ధికి మరింత పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ పరిశీలకుడు భాస్కర్‌రెడ్డి, కన్వీనర్ రాజు నాయుడు, ఎంపీపీ పర్వీన్‌భాను, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌భాషా, మండల అగ్రిబోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, మైనార్టీ కన్వీనర్ బాబ్‌జాన్, సర్పంచ్ గోవిందు, ఎంపీటీసీ రజిత, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వెంకటరంగారెడ్డి, వెంకటరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బైరిశెట్టి, అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన



కొత్తరోడ్డు వద్ద ఓ వీధిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పలు వీధుల్లో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు ఎంపీపీ ఈటె రాము బుధవారం అధికారులతో కలసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో పంచాయతీలోని సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుందన్నారు. ఇందులో భాగంగా ఆయా వీధుల్లో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, మైనారిటీ నాయకులు షామీర్‌బాషా, ఆంజి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జయమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి వదలాలి



తహసీల్దార్ యుగేశ్వరిదేవికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారికి అనుసంధానంగా వేస్తున్న బైపాస్ రోడ్డులో పొలాలకు వెళ్లేందుకు దారి వదలాలని పలువురు రైతులు తహసీల్దార్ యుగేశ్వరి దేవికి వినతిపత్రం అందజేశారు. బుధవారం బత్తలపల్లికి చెందిన రైతులు జక్కంపూటి సత్యనారాయణ, కొంకా గాంధీతో పాటు మరికొందరు రైతులు తహసీల్దార్‌ను కలిశారు. బైపాస్ రోడ్డులో దారి సమస్యను వివరించారు. మండలంలోని బత్తలపల్లి, రాఘవంపల్లి గ్రామాలకు చెందిన రైతులు పూర్వకాలం నుంచి బత్తలపల్లి-చింతలపల్లి దారిని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. రైతులు కూడా తమ పొలాలకు వెళ్లేందుకు ఇదే దారిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ దారిలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రైతులు, ఇతరులు ఉపయుక్తంగా ఉందన్నారు. అయితే ఇప్పుడు కొత్తగా వేస్తున్న బైపాస్ రోడ్డు సర్వే నెంబర్ 277 దగ్గర కలుస్తున్నట్లు తెలిపారు. తద్వారా బైపాస్ రోడ్డుకు ఇరువైపులా రాకపోకలకు దారి వదిలేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కారెడ్డిపల్లి తండాలో నిర్మించనున్న మారెమ్మ గుడి ఆలయానికి వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి బుధవారం రూ.15 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మెంబర్ సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, స్థానిక నాయకులు రామాంజినేయులు పాల్గొన్నారు.

సంతకం ఫోర్జరీ చేసి బిల్లుల స్వాహా

తనకల్లు: తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు చేసుకున్నారని ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రియాంక బుధవారం ఎంపీడీఓ పూల నరసింహులుకు ఫిర్యాదు చేశారు. ఉస్తినిపల్లి ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడు పనులకు సంబంధించిన చెక్కులపై తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓను సంప్రదించగా.. ఫిర్యాదు వాస్తవమేనని, ఎంఈఓ లలితమ్మకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు.

నివాళి

నల్లమాడ: మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏ.అరవిందరెడ్డి మాతృమూర్తి పార్వతమ్మ(90) వయోభారంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం ఉదయం గ్రామానికి వెళ్లి పార్వతమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కొండకిందపల్లిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు నాయకులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వేద పండితులతో పూజలు నిర్వహించి, వాల్మీకి చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు




గాయపడిన జనార్దన్ నాయుడు, శ్రీనివాసులు

బత్తలపల్లి: మండల పరిధిలోని పోట్లమర్రి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు.. బత్తలపల్లికి చెందిన జనార్దన్ నాయుడు ధర్మవరంలోని డెయిరీలో పని చూసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మాల్యవంతం గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇళ్లకు కడ్డీలు కట్టేందుకు వెళ్లి ధర్మవరం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఇద్దరూ పోట్లమర్రి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాల ఫోకస్సింగ్‌కు తప్పించుకునే ప్రయత్నంలో ఒకరినొకరు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడటంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సబ్సిడీ విత్తనకాయలు అందజేస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార రంగం ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల రైతులకు వందశాతం సబ్సిడీ విత్తనకాయల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి సబ్సిడీ, విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు అందజేస్తున్నారు. ఏటా పంట పెట్టుబడికి రూ.13,500 ఇస్తున్నారని చెప్పారు. అనంతరం 91 మంది రైతులకు రూ.10 వేలు విలువ చేసే సబ్సిడీ విత్తన కాయలు (సజ్జలు, జొన్నలు, వేరుశగన), వ్యవసాయ ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ అంజనప్ప సర్పంచులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూలమాల వేసి సన్మానించారు. అనంతరం కోదండ రామస్వామి ఆలయంలో సీతారాములకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేయించారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బత్తల వెంకటరమణను సన్మానించారు.

వేపరాల సచివాలయం తనిఖీ

మండల పరిధిలోని వేపరాల గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంకా సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ గజ్జల లోకేశ్వరరెడ్డి, నాయకులు నాగార్జున రెడ్డి, జిపి తండా సర్పంచ్ శాంతమ్మ, రామ్‌దాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌కు సన్మానం



అనసూయమ్మను సన్మానిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

నల్లచెరువు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ అనసూయమ్మను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, ఏఓ రామకృష్ణ ఏపీఓ మంజుల, ఈసీ బాలు నాయక్, టీఏలు జహీర్, హిమకర్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సత్యసాయి కార్మికుల నిరసన

బత్తలపల్లి: మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. సంవత్సరాల తరబడి సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్నా ఇప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి జగన్ మారుతి, మహబూబ్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ముదిగుబ్బ: డిమాండ్ల సాధన కోసం సత్యసాయి పంప్‌హౌస్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 6వ రోజుకు చేరింది. చంద్ర సూర్యనారాయణ, గోపాల్, ధర్మ, నారాయణస్వామి, మల్లయ్య, రమేష్, రాజగోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ముత్యాలప్ప, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి గిరిప్రదక్షిణ

ప్రశాంతి నిలయం: పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం గిరిప్రదక్షిణ నిర్వహించారు. ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద సత్యసాయి దివ్యరథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపిస్తూ గిరిప్రదక్షిణలో ముందుకు సాగారు. గోకులం గణేష్ సర్కిల్, ఆర్‌వీజే పెట్రోల్ బంక్, చింతతోపు మీదుగా పుట్టపర్తిలో ప్రవేశించి గణేష్ గేట్ వద్ద మంగళహారతితో ముగిసింది. గిరిప్రదక్షిణ సాగుతుండగా పురవీధుల్లో భక్తులు కొబ్బరి కాయలు కొడుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా నగర సంకీర్తన



సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన పశ్చిమబెంగాల్‌కు చెందిన సత్యసాయి భక్తులు బుధవారం నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు సత్యసాయిని రథాన్ని లాగి ప్రారంభించారు. వేలాది మంది సత్యసాయి భక్తుల భక్తిగీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. నగరసంకీర్తనతో పుట్టపర్తి పురవీధులు మార్మోగాయి. ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద మంగళహారతితో కార్యక్రమం ముగిసింది.

నోటీసు

కడప జిల్లా, ప్రొద్దుటూరు టౌన్ వాస్తవ్యుడైన మా కక్షిదారుడు వి. రామాంజినేయరెడ్డి గారు ప్రొద్దుటూరు I A.D.M గారి కోర్టులో (1) C.C. No. 214/2023 మరియు 2) C.C. No. 215/2023 చెక్ బౌన్స్ కేసులను మొత్తం రూ.4 కోట్ల రూపాయలకుగాను మరియు సదరు జిల్లా, కొండాపురం మండలం, తాళ్ళ ప్రొద్దుటూరు గ్రామంలో ఉండే మా కక్షిదారుడైన వై.వి.శ్రీనివాసులరెడ్డి గారు కూడా జమ్మలమడుగు మేజిస్ట్రేట్ గారి కోర్టులో C.C. No. 347/2023 చెక్ బౌన్స్ కేసును 1 (ఒక) కోటి రూపాయలకు గాను సత్యసాయి జిల్లా, కొత్తచెరువు మండలం, చెన్న కేశవాపురం గ్రామ కాపురస్తులైన 1) డాక్టర్ ఉషారాణి సి.రెడ్డి మరియు 2) చెన్నా సి. రెడ్డి అను వారిపైన మా కక్షిదారులు చెక్ బౌన్స్ కేసులు వేసినారు. అట్టి కేసులో ప్రొద్దుటూరు కోర్టులో 18.08.2023 తేదీన, జమ్మలమడుగు కోర్టులో 22.05.2023వ తేదీన వాయిదాలు ఉండినవి. అయితే సదరు కేసులో మీరు హాజరుకాకపోవడం వలన ప్రొద్దుటూరు కోర్టులో కేసులు తిరిగి 01.12.2023 తేదీన, జమ్మలమడుగు కోర్టులో కేసు 30.09.2023 తేదీన తిరిగి వాయిదాలు ఉన్నవి అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ప్రొద్దుటూరు, తేదీ: 31.08.2023

ఇట్లు : **శ్రీ సి. సుదర్శన రెడ్డి,**
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

సంక్షిప్త సమాచారం

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాబ్‌జాన్ (45) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు బాబాజాన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబ్‌జాన్ కదిరిలో నివాసముంటున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశ పెట్టబోతున్న కార్డ్ ప్రైమ్ 2.0 వల్ల వేలాది మంది దస్తావేజు లేఖరులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు, వారి సహాయకులు జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. రెండు రోజులపాటు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్డ్ ప్రైమ్ 2.0 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోండి

పుట్టపర్తి: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని రూరల్ అగ్రికల్చర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు మదన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బుక్కపట్నం మండలంలోని మారాల, కప్తాపురం, పాముదుర్తి ఉన్నత పాఠశాలలో పర్యావరణంపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలాలు, ఇళ్ల పరిసర ప్రాంతాలు, పచ్చిక బైళ్లలో మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యుడు తలమర్ల సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ లియాఖత్, మండల విద్యాధికారి చెన్నకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉదయం 8:40 నుంచి సాయంత్ర 5:30 వరకూ ఏడు సెషన్లుగా సమేవేశాలు నిర్వహించడం జరిందన్నారు. సెషన్స్ వారీగా సూచించిన విషయాలను వ్యాయామ ఉపాధ్యాయులకు తెలియజేశారు. సమావేశంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నజీర్, వెంకటాచలపతి,షఫీ, హరూన్, రవినాయక్ పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం జరిగింది. పీఈటీలు, పీడీలకు విద్యాశాఖ ఏడీఈ రామకృష్ణ సూచనలిచ్చారు.పీడీ, పీఈటీల జాబ్‌కార్డ్, ఫిట్ ఇండియా ఫిట్నెస్ అసెస్మెంట్‌పై చర్చించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఇయర్ ప్లాన్, లెసన్ ప్లాన్‌లపై వివరించారు.

సచివాలయం తనిఖీ



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సూర్యనారాయణ

తనకల్లు: మండల పరిధిలోని ఈతోడు గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు డ్రస్ కోడ్ పాటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కార్యదర్శికి మెమో జారీ చేశారు. ఎంపీడీఓ నరసింహులు పాల్గొన్నారు.

రేపు సచివాలయ భవన ప్రారంభోత్సవం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో రూ.40 లక్షల ఎంజీఎన్‌ఆర్‌జీఈఎస్ నిధులతో నిర్మించిన ఎస్.పీ.కుంట-1 సచివాలయ భవనాన్ని శుక్రవారం ఉదయం 10:00 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణ సహాయం అందజేత

పుట్టపర్తి అర్బన్: మండలంలోని సూరగానిపల్లి గ్రామానికి చెందిన ఎస్.సోమశేఖర్ (38) ఇంటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి కుటుంబానికి రూ.10 వేల తక్షణసాయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వైస్ ఎంపీపీ రంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలకృష్ణ, సూర్యనారాయణ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ జయపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ధర్మవరం రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గిరక రమాదేవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌజన్య కుమారి తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తామని ఏపీఎం రఘునాథరెడ్డి, జాబ్స్ కో-ఆర్డినేటర్ అనంతలక్ష్మి బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీలోపు ధర్మవరంలోని దుర్గా భవానీ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7702100238 నంబర్‌కు సంప్రదించాలన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జెడ్పీటీసీ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మండలంలోని వెల్దుర్తి జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు జగనన్న కాలనీల పేరుతో లక్షలాది ఇళ్లను నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సర్పంచ్ జీవిత తదితరులు పాల్గొన్నారు.